ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

మహబూబాబాద్
గురువారం 20 నవంబరు 2025

బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో పని చేయాలి
కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ 8
అనుమానాస్పదంగా బాలింత మృతి 6

ఉత్సవ కమిటీలు

- కానరాని పర్యవేక్షణ.. లోపిస్తున్న పారదర్శకత
- నిధులు పక్కదారి.. అపరిష్కృతంగా సమస్యలు
- అస్తవ్యస్తంగా సంక్షేమ పథకాల అమలు
- నీరుగారుతున్న కమిటీల ఏర్పాటు లక్ష్యం
- ఇబ్బందుల్లో ఉమ్మడి జిల్లాలోని సామాన్య జనం



నామమాత్రంగా ప్రభుత్వ శాఖల్లోని కమిటీలు

హనుమకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలయ్యేందుకు, నిధులు సకాలంలో సమర్థవంతంగా ఖర్చయ్యేందుకు తగిన పర్యవేక్షణ కోసం ఆయా ప్రభుత్వ శాఖల్లో వేసిన కమిటీలేవి సక్రమంగా పని చేయడం లేదు. ఇవన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయి. మూణ్నెళ్లకోసారి సమావేశమై సమీక్షించాల్సిన కమిటీలోని సభ్యులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీనితో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆయా కమిటీలు నామమాత్రంగా మారుతున్నాయి. ఫలితంగా సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు అందడం లేదు. నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. జవాబుదారితనం లేకుండా పోతోంది. కమిటీల లక్ష్యం నీరుగారి పోతోంది. ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల బలోపేతం, వ్యవసాయంలో సాంకేతికతను ప్రోత్సహించడంతో పాటు పల్లెలు, పట్టణాల్లో ప్రజా పంపిణీ వ్యవస్థను పర్యవేక్షించేందుకు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యావేత్తలు, వివిధ రంగాలకు చెందిన నిపుణులతో గ్రామ, మండల, జిల్లాస్థాయిలో కమిటీలు నామమాత్రంగా మారాయి. నిబంధనల ప్రకారం సభ్యులను నియమిస్తున్నా కార్యకలాపాలు జరగడం లేదు. ఉమ్మడి జిల్లాలో ఆయా కమిటీల పనితీరుపై ప్రత్యేక కథనం

ఆస్పత్రి అభివృద్ధి కమిటీలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ఏర్పాటైన ఆస్పత్రి అభివృద్ధి కమిటీలు నామావశిష్టంగా మారాయి. అసలు ఇవి ఉన్నాయో లేదో తెలియని పరిస్థితి నెలకొన్నది. ఆస్పత్రులకు నిధులొచ్చినప్పుడు మాత్రమే సమావేశాలు నిర్వహిస్తున్న దయనీయ స్థితి నెలకొన్నది. స్థానిక ప్రజాప్రతినిధులు, తహసీల్దార్, ఎంపీడీవో తదితరుల భాగస్వామ్యంతో ఈ కమిటీలు ఏర్పాటవుతాయి. ప్రతీ ప్రభుత్వ ఆస్పత్రికి ఇలాంటి అభివృద్ధి కమిటీ ఒకటి తప్పనిసరిగా ఏర్పాటు కావాలి. ఈ కమిటీలు మూణ్నెళ్లకోసారి సమావేశాలు నిర్వహించి, ఆస్పత్రి అభివృద్ధితో పాటు, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవలసి ఉంటుంది. ఇవి సక్రమంగా పని చేయకపోవడంతో అడిగేవారు లేక డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోగులు అవస్థల పాలవుతున్నారు. ఆస్పత్రిలో ఏదైనా జరగరానిది జరిగినప్పుడో, లేదా సమస్యలు తలెత్తినప్పుడో రోగులు పెద్దఎత్తున ఆందోళనకు దిగినప్పుడో.. హడావుడిగా సమావేశమై మొక్కుబడి సమీక్ష జరుపుతున్నారు. లేదా అడపాదడపా సమావేశం అయి సంతకాలతో సరిపెట్టుకున్నారు. నిధుల వినియోగంపై కమిటీ తీర్మానాలేవి లేక అవి పక్కదారి పడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో చాలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), జిల్లా స్థాయి ఆస్పత్రులలో ఏడాదికోసారి కూడా కమిటీలు సమావేశం కావడం లేదు. చాలా సందర్భాల్లో సంతకాలతోనే సరిపెడుతున్నారు. తెలంగాణలో రెండో అతిపెద్దఆస్పత్రి అయిన వరంగల్ ఎంజీఎం (మిగతా 8వ పేజీలో)

మరికొన్ని కమిటీలు

గ్రామ అభివృద్ధి కమిటీలు, శాంతి కమిటీలు, పారిశుధ్య కమిటీలు, మున్సిపాలిటీల్లో వార్డు కమిటీలు, వరంగల్ మహానగర పాలక సంస్థలో డివిజన్ కమిటీలు, ఇతరత్రా నామమాత్రంగానే పని చేస్తున్నాయి. ఇవి ఉనికిలో ఉన్నాయో లేదో కూడా తెలియని దయనీయ పరిస్థితి ఉమ్మడి జిల్లాలో నెలకొన్నది. కొన్నిచోట్ల అసలు ఇలాంటి కమిటీల ఏర్పాటే జరగలేదు. జిల్లా పరిషత్ స్థాయి సంఘాలే సరిగా పని చేయడం లేదు. వాటి సమావేశాలు మొక్కుబడిగా జరుగుతున్నాయి. మున్సిపాలిటీల పరిధిలో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్సు కమిటీలు అంతంత మాత్రంగానే పని చేస్తుండడంతో పలు అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి వేసిన కమిటీ ఎక్కడా పని చేయడం లేదు. వ్యవసాయ, పశు సంవర్థక, ఉద్యానవన, మత్స్యశాఖలను సమన్వయం చేస్తే ప్రభుత్వం గతంలో సాంకేతిక వ్యవసాయాభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు కూడా ఎక్కడా పని చేస్తున్న దాఖలాలు లేవు.

మహిళలకు ఇందిరమ్మ చీరలు

- పండుగ వాతావరణంలో పంపిణీ
- వీసీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మహబూబాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో కోటిమంది మహిళలకు చీరలను పంపిణీ చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, మాజీ ప్రధాని, దివంగత ఇందిరాగాంధీ జయంతి రోజున ఈ కార్యక్రమాన్ని ప్రారంభించుకున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, సీఎం సలహదారుడు వేం.నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణరావుతో కలిసి సీఎం బుధవారం కలెక్టర్లు, మహిళా సమాఖ్య సభ్యులచే వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డలకు సారె, చీర పెట్టడం తెలంగాణ సంప్రదాయమని, ఇందులో భాగంగానే ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలను పంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. చీరల పంపిణీ ప్రక్రియ కోసం ప్రతీ నియోజకవర్గానికి ఒక ప్రత్యేకాధికారిని నియమించాలని సూచించారు. ఈనెల 19వ తేదీ నుంచి డిసెంబరు 9 వరకు గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ఉంటుందన్నారు. మార్చి 1వ తేదీ నుంచి 8 వరకు పట్టణ ప్రాంతాల్లో చీరలు అందచేస్తామన్నారు.

ఈ వీసీలో మానుకోట నుంచి కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె.అనిల్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ మధుసూదనరాజు, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

ఆస్తి తగాదాలో వాటర్‌ట్యాంక్ ఎక్కిన మహిళ

- ఎస్సై పట్టించుకోవడం లేదని ఆరోపణ

తొర్రూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ ఆస్తి తగాదాలో తనకు న్యాయం చేయాలని వాటర్‌ట్యాంక్ ఎక్కిదూకి చనిపోతానని మహిళ ఆందోళన చేసిన ఘటన బుధవారం తొర్రూరులో చోటు చేసుకుంది. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం. తొర్రూరు అంబేద్కర్ నగర్‌కు చెందిన మంగళపల్లి యాకయ్య, ప్రసాద్, రవి అన్నదమ్ములు. వారికి తల్లిదండ్రుల నుంచి 21 గుంటల వ్యవసాయ భూమి సంక్రమించింది. రవి క్రాఫ్ట్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. యాకయ్య ఎల్ఐసీ ఏజెంట్, ప్రసాద్ మునిసిపాలిటీలో కాంటిజెంట్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రుల నుంచి వచ్చిన భూమిని రవి, యాకయ్య కులపెద్దమనుషులతో మాట్లాడి వారి పేరిట రాయించుకుని తనను కొట్టారని బాధిత మహిళ యాకాంత ఆరోపించింది.

దీనిపై అదేరోజు తొర్రూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సై ఉపేందర్ కేసును పక్కన పెట్టి యాకయ్య, రవిలతో కుమ్మక్కై బాండ్ పేపర్ తెప్పించి బలవంతంగా తన భర్త ప్రసాద్‌తో సంతకాలు చేయించుకున్నాడని, తనకు న్యాయం చేయలేదని ఆరోపించింది. తల్లిదండ్రులు చనిపోయినా ఎలాంటి కార్యక్రమాలు చేయవద్దని సంబంధం లేదని రాయించాడని తెలిపింది. గత 2 నెలలుగా పోలీసుస్టేషన్ చుట్టూ తిరిగినా తమకు న్యాయం చేయడంలేదని, తనభర్త ప్రసాద్‌కు తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఆస్తి దక్కకపోవడంతో చావే శరణ్యమని వాటర్‌ట్యాంక్ ఎక్కినట్లు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు యాకాంతను సముదాయించి కిందకి దింపారు. ఈ విషయంపై ఎస్సై ఉపేందర్‌ను వివరణ కోరగా ఎలాంటి కేసు నమోదు కాలేదని, దర్యాప్తు చేస్తున్నామని తాను ఎవరికి అనుకూలంగా వ్యవహరించలేదన్నారు. కేసు దర్యాప్తు చేసి వివరాల నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.


వాటర్‌ట్యాంక్ ఎక్కి నిరసన తెలుపుతున్న మహిళ


కేసముద్రం విలేజిలో వృథాగా పోతున్న తాగునీరు

రోడ్డు పనుల్లో పగిలిన భగీరథ పైపులైను

వృథాగా పోయిన తాగునీరు

కేసముద్రం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం విలేజి ఎన్టీఆర్ విగ్రహం కూడలి సమీపంలో బుధవారం సాయంత్రం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఎక్స్‌కవేటర్ యంత్రంతో తవ్వుతుండగా మిషన్ భగీరథ పైపులైను పగిలిపోయింది. పెద్దపైపు కావడంతో భారీగా తాగునీరు వృథాగా పోయింది. కొద్దిసేపటి తర్వాత నీటి సరఫరాను నిలిపివేశారు. పైపు ద్వారా వివిధ గ్రామాలకు వెళ్లే తాగునీటి సరఫరా నిలిచిపోయింది. పైపు పగిలిన చోట మరమ్మతులు చేపట్టి నీటిని యథావిధిగా అందించాలని పలువురు కోరుతున్నారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి

సీడబ్ల్యూసీ జిల్లా చైర్‌పర్సన్ నాగవాణి



బాలికల గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న నాగవాణి

మహబూబాబాద్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అపరిచిత వ్యక్తుల పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ)జిల్లా చైర్‌పర్సన్ నాగవాణి అన్నారు. మహబూబాబాద్‌లోని సాంఘిక సంక్షేమ సంక్షేమ బాలికల పాఠశాలలో బుధవారం ఎఫ్ఎంఎం సహకారంతో లైంగికదాడుల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడుతూ బాలికలపై జరిగే లైంగిక దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు అశోక్, డేవిడ్, షీటీం ఎస్సై సుధాకర్, రోహిణి, సుప్రజ, వీరన్న, ఎన్జీవోస్ సభ్యులు హిమబిందు, సమర, శిరీష పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి


మరిపెడలో ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు 8

సన్నాలకు డిమాండ్

- పెరుగుతున్న ధాన్యం ధర
- 'మద్దతు'కు మించి సన్నవడ్లకు రేటు
- 'ఆర్ఎన్ఆర్' క్వింటాకు గరిష్టంగా రూ.2,599
- 9రోజుల్లో క్వింటాకు రూ.300 పెరుగుదల


కేసముద్రం మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన ధాన్యం

కేసముద్రం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో సన్నరకం ధాన్యం ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 9రోజుల వ్యవధిలోనే క్వింటాకు సగటు ధర రూ.2281 నుంచి రూ.2580 వరకు చేరి రూ.300లకు పైగా ధర పెరగడం విశేషం. సన్నరకం ('ఏ'-గ్రేడు) ధాన్యానికి ప్రభుత్వ కనీస మద్దతు ధర రూ.2389 ఉండగా, వారం రోజులుగా మార్కెట్లో అంతకుమించి ధరలు నమోదవుతున్నాయి. బుధవారం మార్కెట్‌కు అతిసన్నరకాలైన జైశ్రీరామ్ ధాన్యం ఏడుగురు రైతులు 398 బస్తాలు తీసుకువచ్చారు. ఆర్ఎన్ఆర్ రకం 47 మంది 1,821 బస్తాలు, హెచ్ఎంటీ రకం ఏడుగురు రైతులు 335 బస్తాల్లో విక్రయానికి మార్కెట్‌కు తీసుకువచ్చారు. ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈ-నామ్) విధానంలోని 'ఈ-వేలం'లో జైశ్రీరామ్ రకం క్వింటాకు గరిష్టంగా రూ.2999, కనిష్టంగా రూ.2725, సగటున రూ.2750, ఆర్ఎన్ఆర్ రకం గరిష్టంగా రూ.2599, కనిష్టంగా రూ. 2322, సగటున రూ.2580, హెచ్ఎంటీ రకం ధాన్యం గరిష్టంగా రూ.2591, కనిష్టంగా రూ.2059, సగటున రూ.2566 ధరల చొప్పున వ్యాపారులు ఖరీదులు చేశారు. మార్కెట్‌కు ధాన్యం సీజన్ ఆరంభమై పది రోజులు కావొస్తుండగా అధికంగా ఆర్ఎన్ఆర్ రకం ధాన్యం విక్రయానికి వస్తోంది. ఈ ధాన్యం ధర గత ఐదు రోజులుగా క్రమంగా పెరుగుతోంది.

హోల్‌సేల్ మార్కెట్లో విపరీత డిమాండ్..

కేసముద్రం మార్కెట్లో వ్యాపారులు కొనుగోలు చేసే ధాన్యాన్ని తెలంగాణ రాష్ట్రంతో పాటు.. ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు ఎగుమతులు చేస్తుంటారు. హోల్‌సేల్ మార్కెట్లో వాణిజ్యపరంగా రిటైల్ విక్రయాలు అధికంగా ఉండే అతిసన్న, సన్నరకాలకు డిమాండ్ పెరుగుతూ వస్తోంది. ప్రముఖ బ్రాండ్ల కంపెనీలకు ఇక్కడి నుంచే ధాన్యం ఎగుమతి అవుతోంది. ఆయా కంపెనీలకు ఏటా సీజన్ ఆరంభంలో ధాన్యం భారీ మొత్తంలో లక్షల క్వింటాళ్లు అవసరం ఉంటాయి.

ఇక్కడి మార్కెట్లో తొమ్మిదిరోజుల క్రితం ఆర్ఎన్ఆర్ ధర క్వింటాకు సగటున రూ.2,281 ఉండగా.. ఐదు రోజుల క్రితం రూ.2,421, మంగళవారం రూ.2,563, తాజాగా రూ.2,580కి చేరింది. వారం రోజులుగా క్రమంగా ఆర్ఎన్ఆర్ ధర వేగంగా పెరుగుతుండడం గమనార్హం. ప్రస్తుతం వరికోతలు నిదానంగా సాగడం, మార్కెట్‌కు స్వల్పంగా ధాన్యం సప్లై ఉండడంతో హోల్ మార్కెట్‌లోని డిమాండ్ ప్రభావితమై ధరలు క్రమంగా పెరుగుతున్నట్లు వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. ధాన్యం సప్లై స్వల్పంగా ఇలాగే కొనసాగితే వారం, పది రోజులపాటు క్వింటాకు మరో రూ.50 నుంచి రూ.100 వరకు పెరిగే అవకాశాలున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. సప్లై గనక భారీగా వస్తే ధర రూ.100 తగ్గే సూచనలున్నాయని విశ్లేషిస్తున్నారు. మార్కెట్లో మద్దతుకు మించి ధరలు వస్తుండడంతో త్వరితగతిన ధాన్యం విక్రయించేందుకు వేగంగా తమ వరికోతలను సాగిస్తున్నారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య


సత్యనారాయణ (ఫైల్)

గార్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కుటుంబంలో నెలకొన్న సమస్యలతో ఆటోడ్రైవర్ మాదా సత్యనారాయణ (30) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గార్ల మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకొంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం. మాదా సత్యనారాయణ రోజూ గార్ల నుంచి సత్యనారాయపురం క్రాస్‌రోడ్ వరకు ఆటోను నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తల్లిదండ్రులు సంపాదించిన నాలుగు ఎకరాల పొలంలో తనకు రావల్సిన వాటాను రాకుండా అన్న మాదా శ్రీను భార్య విజయ రాకుండా అడ్డుపడుతోందని ఓ లెటర్‌ను రాసి జేబులో పెట్టుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన సత్యనారాయణ ఊరిబయటల గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య అనిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్సై సాయికుమార్ దర్యాప్తు చేస్తున్నారు.


జిల్లా గ్రంథాలయ వారోత్సవాల్లో మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

స్వాతంత్ర్య ఉద్యమంలో గ్రంథాలయాలది కీలక పాత్ర

క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో గ్రంథాలయాలు ముఖ్య భూమిక పోషించాయని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.అజయ్‌సారధిరెడ్డి అన్నారు. గ్రంథాలయాల్లోని పుస్తకాలు, పత్రికలు ప్రజల్లో చైతన్యం కల్పించాయని పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయంలో బుధవారం హైస్కూల్, కళాశాల స్థాయి విద్యార్థినీలకు రంగోళి పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రంథ పాలకులు జి. విజేందర్, సీహెచ్.రవి, రుద్రారపు వీరేందర్, భూలక్ష్మి, యాదమ్మ, రిటైర్డ్ లైబ్రేరియన్ గూడ నరేందర్, గాదె శ్యాంప్రసాద్, అబ్బగాని భాస్కర్, పెరుగు కుమార్, వి.రవి, సీహెచ్. వెంకన్న, అనిల్, నారాయణ, శారద పాల్గొన్నారు

పత్తి కొనుగోళ్లపై నిబంధనలు ఎత్తివేయాలి

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి

కురవి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం పత్తి కొనుగోళ్లపై పెట్టిన నిబంధనలు ఎత్తివేయాలని మరిపెడ ఆత్మ చైర్మన్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కురవిలో బుధవారం జరిగిన సీపీఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీసీఐ తేమ 8 నుంచి 12 శాతం ఉంటేనే కొనుగోలు చేస్తామని షరతులు పెట్టి, రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకుంటేనే పత్తి కొంటామనే నిబంధనలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈనెల 21న సీపీఐ వందేళ్ల ప్రచార బస్సుజాత కురవికి వస్తుందని, ఈ బస్సుజాతాను విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో నాయకులు తురక రమేష్, బుడమ వెంకన్న, నిలుగొండ నాగేశ్వర్‌రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామన్నగూడెంలో వృద్ధురాలి హత్య

విచారణ చేపట్టిన పోలీస్‌లు


కల్లెపు పద్మ(ఫైల్)

నెల్లికుదురు, నవంబరు19 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వ్యక్తులు వృద్ధురాలును హత్య చేసిన ఘటన రామన్నగూడెంలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్సై రమేష్‌బాబు కథనం ప్రకారం. కురవి మండలం తిర్మలాపురం గ్రామానికి చెందిన కల్లెపు పద్మ (62)కు ముగ్గురు కుమార్తెల సంతానం. కూతుర్ల వివాహం అనంతరం.. 7 ఏళ్ల క్రితం ఆమె భర్త సీతయ్య మృతి చెందాడు. దీంతో నెల్లికుదురు మండలం రామన్నగూడెంలోని రెండోకూతురు కోయ్యేడి సరిత-సుధాకర్ దంపతుల ఇంట్లో ఉంటుంది. ఈ క్రమంలో బతుకుదెరువు కోసం అల్లుడు, కుమార్తె హైదరాబాద్‌కు వెళ్లి, అక్కడే ఉంటుండగా.. ఇంట్లో ఒంటరిగా పద్మ నివసిస్తోంది. కాగా, పద్మ రోజూ ఉదయం 5 గంటలకు నిద్రలేచి, వాకిలి ఊడ్చి ముగ్గులు వేసేది. బుధవారం ఉదయం 8 గంటలు కావస్తున్నప్పటికీ ఆమె బయటికి రాకపోవడంతో గ్రామస్థులు ఇంటి తలుపులు తెరిచి చూశారు.

తలకు తీవ్రగాయాలై మంచంలోనే పద్మ మృతిచెంది కనిపించింది. గుర్తుతెలియని వ్యక్తులు కర్రలతో కొట్టి హత్యచేసి ఉండవచ్చని, నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కూతురు సరిత పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



మునిసిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మునిసిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. బుధవారం పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తొర్రూరు మునిసిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల మునిసిపాలిటీకి టీయూఎఫ్ఐడీసీ ద్వారా రూ.15కోట్ల నిధులు మంజూరయ్యాయని వాటిని సమర్థవంతంగా వినియోగించి పట్టణంలో రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఇప్పటివరకు జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను తెలుసుకుని తగు సూచనలు చేశారు. పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శ్యాంసుందర్, ఏఈ రంజిత్ ఉన్నారు.

గంట్లకుంట దుర్గామాత ఆలయంలో చోరీ

పెద్దవంగర, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంట్లకుంట గ్రామ దుర్గామాత ఆలయంలో చోరీ సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గంట్లకుంట గ్రామ దుర్గామాత ఆలయ పూజారి జిన్న సతీష్ తెలిసిన వివరాల ప్రకారం.. రోజువారీగా మంగళవారం పూజలు చేసి ఆలయానికి తాళం వేసి వెళ్ళాడు. బుధవారం తెల్లవారు జమున ఆలయంలో పూజలు చేయడానికి వెళ్లిన క్రమంలో ఆలయ తాళం పగలగొట్టి తలుపులు తెరచి ఉన్నాయి. దుర్గామాతకు అలకరించిన బంగారం, వెండి (ముక్కుపడుక, కన్నులు) అభరణాలను గుర్తు తెలియని దుండగులు అపహరించారు. ఆలయ హుండీ ఎత్తుకెళ్లి ఆలయ సమీపంలోని క్వారీలో పడేశారు. దీనిపై ఏఎస్సై హీదయాత్ వివరణ కోరగా ఘటన స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. ఇటీవల మండల కేంద్రంలో దుర్గామాత ఆలయంలో చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఆగంతకులు వరుసగా దుర్గామాత ఆలయాలను టార్గెట్ చేయడంతో మండల ప్రజలు ఉలిక్కిపడుతున్నారు.

పీఏసీఎస్ పాలకవర్గం కొనసాగింపు

తొర్రూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):తొర్రూరు ప్రాథమిక సహకార సంఘం సొసైటీ పదవీకాలాన్ని కొనసాగిస్తున్నట్లు జిల్లా కో-ఆపరేటివ్ అధికారి వెంకటేశ్వర్లు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. జనవరిలో సొసైటీల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం తిరిగి పొడగించింది. తొర్రూరు సొసైటీ పాలకవర్గాన్ని గత నెల రోజుల కిందట సస్పెండ్ చేశారు. పాలకవర్గ సభ్యులు కోర్టుకు వెళ్లిన నేపథ్యంలో కోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాల మేరకు ప్రస్తుత కమిటీనే కొనసాగించాలని సూచించడంతో దానిని అమలు చేస్తూ తొర్రూరు పీఏసీఎస్ వ్యవహారాలు సక్రమంగా నడిచేందుకు రైతుల అవసరాలు దృష్టిలో పెట్టుకుని గత పాలకవర్గమే కొనసాగుతుందని తెలిపారు. జిల్లా సొసైటీ అధికారి ఆదేశాలు జారీ చేయడంతో పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ పాలకవర్గం కొనసాగనుంది.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను వినియోగించుకోవాలి

తొర్రూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్ట్‌లను వినియోగించుకోవాలని జన విజ్ఞాన వేదిక తొర్రూరు మండల అధ్యక్షుడు తాళ్లపల్లి రమేశ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన తొర్రూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు గ్రూపులుగా ఏర్పరచి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తారని ఆయా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను పంపాలని ఆయన తెలిపారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతి ప్రదానంతో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికవుతారన్నారు.

ఆనకట్టను నిర్మించండి మహాప్రభో..

- ఐదు దశాబ్దాల కిందట నిర్మించిన ఆనకట్ట
- మొంథా తుఫాన్ తాకిడికి రెండు ముక్కలు
- మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలకు సాగు, తాగునీరు



మొంథా తుఫాన్ తాకిడికి రెండు ముక్కలైన ఆనకట్ట

మరిపెడ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఐదు దశాబ్దాల కిందట నిర్మించిన ఆనకట్ట మొంథా తుఫాన్ తాకిడికి రెండు ముక్కలుగా చీలిపోయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ వంక చూడకపోవడం విచారకరం. ఫలితంగా రెండు జిల్లాల సరిహద్దు ఉన్న ఆనకట్ట రైతులు తమ పంటలు పండించేందుకు అనేక అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం చెరువులు, కుంటల మరమ్మతు పేరుతో రూ.కోట్లాదిగా వెచ్చించిన అధికారుల అంచనాలో ఈఆనకట్ట లేకపోవడం విడ్డూరమే. అయినప్పటికీ ప్రభుత్వం మారిన రైతుల పరిస్థితి అంతే ఉందని ఆయా గ్రామాల, తండాల రైతులు దీనావస్థలో ఉన్నారు. వివరాల్లోకి వెళ్తే మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ఉమ్మడి తానంచర్ల పరిధిలోని ఆనకట్ట తండా సమీపంలో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు జనవరి 5న 1977లో శంకుస్థాన జరిపి అదే సంవత్సరంలో ఆనకట్ట నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ ఆనకట్ట ఎడమ కాలువ కింద అజ్మీర, ఆనకట్ట, చౌళ్ల, తాళ్లవూకల్, ఆర్లగడ్డ, డక్నా, పాంబండ, చాంప్లా తండాలలోనే గిరిజన రైతులు 9వందల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుంది.

అదే విధంగా కుడి కాలువ ఖమ్మం జిల్లాలో కాకరవాయి గ్రామం. దాని శివారు గల తండాల్లో 6వందల ఎకరాలకు సాగునీరందుతుంది. సుమారు 26 ఏళ్ల కిందట ఆనకట్టకు నాలుగు చోట్ల గండ్లు పడ్డాయి. వర్షాలకు పాలేరు వాగు పారుతున్న సమయంలో గండ్లు పడిన చోట ఇసుక బస్తాలు అడ్డుగా పెట్టడం, పెద్ద పెద్దరాళ్లు అడ్డుగా పెట్టి నీరు నిలుపుకునే ప్రయత్నం చేస్తుంటారు. ఇన్ని అవస్థలు పడుతూ తమ పంటలు పండించుకుంటున్నా.. తమను పట్టించుకున్న నాథుడే కరువయ్యారని ఆయా గ్రామాలు, తండాలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆనకట్టను నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

యాసంగికి సాగు నీరు కష్టమే..

భూక్యా పాశ్యా, రైతు, ఆనకట్ట తండా



మొంథా తుఫాన్ తాకిడికి ఆనకట్టను రెండు ముక్కలుగా చీలిపోయింది. ఆనకట్టలో ఏ మాత్రం నీరు నిల్వడం లేదు. ఖరీఫ్ సీజన్‌లో ఏలాగో అలాగ పంటలు చేతికి వచ్చాయి. యాసంగి పంటకు సాగు నీరు కష్టమే. వరి పొట్ట దశకు వచ్చి, పంట చేతికి వచ్చే సమయంలో పంట పూర్తిగా దెబ్బ తింటుంది. అధికారులు స్పందించి ఆనకట్టను నిర్మించాలి.

వేసవిలో తాగు నీరు ఇబ్బందే..

భూక్యా మంగ్తా, రైతు, ఆనకట్ట తండా



వేసవిలో తాగునీటికి ఇబ్బందులు ఉంటాయి. సుమారు 25 తండాల గిరిజనులు తాగునీటికి అనేక ఇబ్బందులు కలుగుతాయి. సత్వరమే మొంథా తుఫాన్ తాకిడికి పూర్తిగా ధ్వంసమైన ఈ ఆనకట్టను నిర్మించాలి.

అనుమానాస్పదంగా బాలింత మృతి



డొంక శారద మృతదేహం

తొర్రూరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అనుమానస్పదంగా ఓ బాలింత మృతి చెందిన సంఘటన మండలంలోని అమ్మాపురంలో బుధవారం చోటు చేసుకుంది. తొర్రూరు ఎస్సై గొల్లముడి ఉపేందర్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అమ్మాపురానికి చెందిన డొంక సామేల్‌తో గత మూడేళ్ల కిందట పెద్దవంగరకు చెందిన చిలుక సమ్మయ్య కుమార్తె శారద (28)తో వివాహమైంది. ఇరువురి మధ్య నిత్యం గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో వారికి ఒక బాబు జన్మించగా, నెల రోజుల కిందట పాప జన్మించింది. బాలింత అయిన శారద అనారోగ్యంతో ఉండడంతో తండ్రి సమ్మయ్య పెద్దవంగరకు తీసుకెళ్లాడు.తన భార్యను పంపించాలని మామతో సామేల్ గొడవపడి నీ కూతురుకు ఏమైనా నాదే బాధ్యత అంటూ ఈ నెల 17న అమ్మాపురం గ్రామానికి తీసుకెళ్లాడు. తీసుకెళ్లిన మరునటి రోజు ఏమైదో తెలియకుండానే తల్లిగారి ఇంటి వద్ద వదిలిపెట్టి వెళ్లాడు. తల్లిగారింటికి వచ్చినప్పటి నుంచి కడుపు నొప్పితో బాధపడుతుండగా 18వ తేదీన వరంగల్ ఎంజీఎం ఆస్పతిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకొచ్చారు. కాగా, 19న నొప్పి తీవ్రం కావడంతో తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా పరిస్తితి విషమించడంతో, వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. శారదను భర్త సామేల్ కొట్టడంతోనే మృతిచెందిన్నట్లు మృతురాలి తండ్రి చిలుక సమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పరామర్శ

మరిపెడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు బుధవారం పరామర్శించారు. గత కొద్ది రోజుల కిందట మరిపెడ మునిసి పల్ కేంద్రానికి చెందిన జొన్నలగడ్డ నాగచారి మృతి చెందారు. ఈ విషయం తెలిసి నవీన్ రావు బాధిత కుటుంబాన్ని కలుసుకొని ఓదార్చారు. ఆయన వెంట రేఖ వెంకన్న, బోర మల్లయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు టీ షర్టులు పంపిణీ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రం పత్తిపాకలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టీ షర్టులు, నెక్కర్లు, స్కట్స్‌లు అందజేశారు. స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రతిభ, ఉపాధ్యాయురాలు ఝాన్సీ విధులు నిర్వహిస్తున్న పాఠశాలలో 48 మంది విద్యార్థులకు రూ.23 వేల విలువగల టీ షర్టులు, నెక్కర్లు, స్కట్స్‌ను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సిరినాయక్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సిరినాయక్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యాబోధనతో పాటు తమ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు టీ షర్టులు, నెక్కర్లు, స్కట్స్ అందజేయడం వలన క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులను ప్రతి రోజు పాఠశాలకు పంపించడంతో పాటు ప్రతి రోజు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాఠశాలకు వచ్చి పిల్లల ప్రగతి ఎలా ఉంది అని తెలుసుకోవాలని కోరారు. సొంత ఖర్చులతో పిల్లలకు టీ షర్టులు అందజేయడం వలన విద్యార్థుల్లో నూతనోత్తేజం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ ముత్యాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీనియర్ టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలి



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేశ్

మరిపెడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని టీపీటీఎఫ్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బలాష్టి రమేశ్, విష్ణువర్ధన్‌రెడ్డిలు తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు పాఠశాలలో టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు పక్రియను ఆ సంఘ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2010 సంవత్సరానికి ముందు నిర్వహించిన డీఎస్సీలో టెట్ ప్రస్తావన లేదని గుర్తుచేశారు. కోర్టు సైతం సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ లేదని తేల్చిచెప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ బాధ్యులు పవన్‌కుమార్, హాఫీజర్, దోసపాటి మల్లయ్య తదితరులు ఉన్నారు.

సీఐటీయూ జిల్లా మహా సభలను జయప్రదం చేయాలి

మరిపెడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మునిసిపల్ కేంద్రంలో ఈ నెల 28, 29 తేదీలలో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలను అసంఘటిత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మరిపెడ మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కొండ ఉప్పలయ్య పిలుపునిచ్చారు. బుధవారం ఆ సంఘ సమావేశం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరుగగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సుంకరి వెంకన్న, సైదులు, యాదగిరి, కొండ వెంకన్న, భిక్షం, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిగా ఏమీ చేయలేకపోయా

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో సీసీ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో నాలుగేళ్లు విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ విద్యా వ్యవస్థను మెరుగుపర్చలేక పోయానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. అప్పటి సీఎం నుంచి ఏ రకమైన సహకారం లభించలేదని, విద్యాభివృద్ధిపై తనకు సంకల్పం, చిత్తశుద్ధి, కమిట్‌మెంట్ ఉన్నా.. ఏమీ చేయలేకపోయానని తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని కేజీబీవీ, మోడల్ స్కూల్ ఆవరణలో రూ.28 లక్షలతో చేపట్టనున్న సీసీ పనులకు వరంగల్ ఎంపీ కడియం కావ్యతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉండి విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తూ అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. చదువుకు మాత్రమే జీవితాలను మార్చే శక్తి ఉందని, చదువుతోనే మహిళా సాధికారత సాధ్యం అవుతుందన్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి రూ.200 కోట్లతో రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నారని, ఘన్‌పూర్‌కు కూడా మంజూరైందని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఏడు కేజీబీవీల్లో వసతుల కల్పన కోసం రూ.6 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఘన్‌పూర్ కేజీబీవీలో రూ.45 లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మరుగుదొడ్లు, సంప్, సీసీరోడ్ల నిర్మాణం కోసం రూ.కోటి నిధులు మంజూరి చేయనున్నట్లు తెలిపారు.

వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. గత పదేళ్ల పాటు స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి మంచి నాయకుడు ఎమ్మెల్యే లేనందునే కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌లో ఎలాంటి అభివృద్ధి పనులు జరుగలేదని అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో గురుకులాలు, కేజీబీవీలను ఇంటర్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయడం వలన అనేక మంది విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఎంపీ నిధులతో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తానని తెలిపారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే విద్యార్థులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ జూలకుంట్ల లావణ్య-శిరీష్‌రెడ్డి, జీసీడీవో గౌసియా బేగం, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో నర్సింగరావు, ఎస్‌వో రజిత, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు పురమాని రజాక్ యాదవ్, అంబటి కిషన్‌రాజు, పోశాల క్రిష్ణ, నాగరబోయిన శ్రీరాములు, గన్ను నర్సింహులు, పోలెపల్లి రంజిత్‌రెడ్డి, కొలిపాక సతీష్, తెల్లాకుల రామకృష్ణ, పురమాని ఐలోని తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా రగ్బీ జట్టు ఎంపికకు పోటీలు



రగ్బీ పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీహైస్కూల్ హెచ్ఎం నర్సింహారావు

డోర్నకల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి అండర్-17 విభాగంలో రగ్బీజట్టు ఎంపికకు బుధవారం డోర్నకల్‌లో క్రీడలు నిర్వహించారు. డోర్నకల్ జడ్పీహైస్కూల్ హెచ్ఎం బండి నర్సింహారావు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి వచ్చిన 180 మంది క్రీడాకారులు రగ్బీ పోటీలకు ఎంపిక పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో మహబూబాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీతారాములు, తలారి విద్యాసాగర్, పీడీలు రవికుమార్, సునిల్, మహ్మద్ ఇమామ్, కాశీనాథ్, కమలకిశోర్, శ్రీకాంత్, మాధవి, సీఎస్ఐ సెక్రటరీ మోజేస్ పాల్గొన్నారు.

ఉత్సవాలను జయప్రదం చేయాలి



శతజయంతి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీహెచ్.శ్రీనివాస్

కురవి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కురవిలో 23న జరిగే భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని సత్యసాయి సేవా సమితి మండల అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాస్ అన్నారు. కురవిలో బుధవారం సత్యసాయి శతజయంతి ఉత్సవాల పోస్టర్లు, ఫ్లెక్సీలు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవాన్ సత్యసాయి అనేక సేవా కార్యక్రమాలతో ప్రజల గుండెల్లో నిలిచిపోయారని, ఆయన శతజయంతి ఉత్సవాల్లో ప్రతీ ఒక్కరు పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో జి.తిరుమళ్‌రావు, బుక్క వీరన్న, వేమిశెట్టి సంతోష్, బత్తిని నర్సయ్య, బాదె నాగన్న, సంగెం నాగరాజు, బత్తిని వీరభద్రం, పాక కృష్ణ పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

కొత్తగూడ, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలికి సుహయోగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సభ్యులు బుధవారం రూ.50వేలు ఆర్థిక సాయం చేశారు. కోనాపురం గ్రామానికి చెందిన నార్లపురం కట్టమ్మ కాలుగాయంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు ననుబోతుల లింగన్నయాదవ్, వంగ రాజు, బండి రాజు ఆర్థిక సాయం చేశారు.



కోనాపురంలో బాధితులకు నగదు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ

బయ్యారం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో బుధవారం ప్రభుత్వ యునాని వైద్య ఆస్పత్రి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శంకర్ పలువురితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఎన్‌వోలు అశోక్, మున్నా పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

డోర్నకల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఝాన్సీలక్ష్మీబాయిని స్ఫూర్తిగా తీసుకుని అన్ని రంగాల్లో రాణించాలని నేతాజీ సేవా సమితి వ్యవస్థాపకుడు కందుల నాగరాజు అన్నారు. బుధవారం ఝాన్సీలక్ష్మీబాయి జయంతిని స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఝాన్సీలక్ష్మీబాయి 1857లో ప్రప్రథమంగా బ్రిటీష్‌వారిపై తిరుగుబాటు చేసిందని, ఆమె పౌరుషాన్ని ప్రతీ ఒక్కరు గుర్తించి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం కేజీబీవీ ఉపాధ్యాయులు మంజుల, శ్రీదేవి, సరిత, ఆక్సా, ఎల్జబేత్‌లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మౌనికజైన్, భారతిజైన్, మమతాజైన్, సర్వాజైన్, సునీల్ పాట్నీ, వివేక్, గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ జీవితం దేశానికి ఆదర్శం

గార్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దేశంలో తొలి మహిళా ప్రధాన మంత్రిగా పేదల సంక్షేమం కోసం అనేక సంస్కరణలు చేసిన ఘనత ఇందిరాగాంధీకే దక్కిందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దనియాకుల రామారావు అన్నారు. బుధవారం కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూసెంటర్‌లో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూలమాలు వేసి, నివాళులర్పించారు. మాజీ జడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మీ, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్‌నాయక్, కట్టా శ్రీనివాస్‌రావు, భూక్యా రాంకుమార్ నాయక్, అశోక్ , కిషన్ నాయక్, రాంసింగ్ నాయక్, చిట్టిబాబు నాయక్, లింగాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బస్ యాత్రను జయప్రదం చేయాలి

గార్ల, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ 100 వసంతాల సందర్భంగా 21న గార్లలో జరిగే సీపీఐ బస్ యాత్రను పార్టీ కార్యకర్తలు విజయవంతం చేయాలని మండల కార్యదర్శి జంపాల వెంకన్న కోరారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన ఆపార్టీ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, భిక్షమయ్య, ధరావత్ వీరన్న పాల్గొన్నారు.

కురవిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్న నాటి విద్యార్థినులు

కురవి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కురవి జడ్పీఎస్ఎస్‌లో 1980లో పదో తరగతి చదివిన విద్యార్థినులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. 45 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న గత స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో నరేడ్ల రాజేశ్వరి, మల్లీశ్వరి, జంపాల భద్రకాళి, సోమ నర్సమ్మ, పార్వతి, హేమలత, పద్మ, రాణి, భద్రకాళి పాల్గొన్నారు.

హేమాచలుడి సన్నిధిలో కేంద్ర మాజీ మంత్రి

మంగపేట నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బుధవారం కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్య నారాయణ ప్రత్యేక పూజలు చేశారు. గర్భగుడిలో వారి కుటుంబ సభ్యుల నామ గోత్రాలపై అర్చకులు పూజలు చేశారు.

ఎస్సీ గురుకులాలపై ప్రత్యేక శ్రద్ధ

- సమస్యల పరిష్కారంపై దృష్టి
- జిల్లాకు ఒక సమన్వయ అధికారి నియామకం
- అదనంగా జోనల్ అధికారుల భర్తీ
- ఉద్యోగులకు త్వరలో పదోన్నతులు
- 'ఆంధ్రజ్యోతి' వార్తకు స్పందన

హనుమకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల (టీజీఎస్‌డబ్ల్యూఆర్)పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ పాఠశాలల్లో పేరుకు పోయిన సమస్యలను పరిష్కరించే దిశగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా వీటి పర్యవేక్షణకు 33 జిల్లాలకు సమన్వయాధికారులను నియమించింది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొత్తగా ఆరుగురు కోఆర్డినేటర్లు నియమితులయ్యారు. అలాగే గురుకులాల నిర్వహణను మరింత మెరుగు పరిచేందుకు, బోధనా ప్రమాణాల మెరుగు, సౌకర్యాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శనం చేయడానికి మొదటిసారిగా జోనల్, మల్టీ జోనల్ అధికారులనూ నియమించింది. ఈ మేరకు సొసైటీ సెక్రటరీ కృష్ణ ఆదిత్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 5న గురుకులాల్లో పదోన్నతుల్లో జాప్యం పేరుతో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవడం మొదలు పెట్టింది.



త్వరలో పదోన్నతులు

టీజీ ఎస్‌డబ్ల్యూఆర్ విద్యా సంస్థల్లో అన్ని స్థాయిల్లో పదోన్నతులు లేక ఉద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవుతున్న అంశంపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. పదోన్నతుల్లో జాప్యం వల్ల వారు సర్వీస్, ఆర్థికంగానూ నష్టపోతున్నారు. అనేక సంవత్సరాలుగా పదోన్నతులు లేక గురుకులాల్లో విద్య గాడి తప్పుతోంది. గురుకులాల్లో 1,650 పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 250 నుంచి 300 మంది ఉద్యోగులకు పదోన్నతులు రావాల్సి ఉంది. క్రింది స్థాయిలో పదోన్నతులను పట్టించుకోవడం లేదన్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం త్వరలోనే ఈ దిశగా చర్యలు తీసుకునేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో కో-ఆర్డినేటర్లు

ఇందులో భాగంగా భూపాలపల్లి జిల్లాకు గ్రేడ్-2 ప్రిన్సిపాల్ జి రజనిని, ములుగు జిల్లాకు గ్రేడ్-1 ప్రిన్సిపాల్ ఎ. వెంకటేశ్వర్లు మహబూబాబాద్ జిల్లాకు గ్రేడ్-1 ప్రిన్సిపాల్ బి జాక్విలిన్, హనుమకొండ జిల్లాకు గ్రేడ్-1 ప్రిన్సిపాల్ డి ఉమామహేశ్వరి, వరంగల్ జిల్లాకు గ్రేడ్-1 ప్రిన్సిపాల్ పి. అపర్ణను జనగామ జిల్లాకు గ్రేడ్-1 ప్రిన్సిపాల్ పి. శ్రీనివాసరావు నియమించింది.

ఇంతకు ముందు ఇన్‌చార్జిలుగా ఉన్నవారి స్థానంలోనే సీనియారిటీ ప్రకారం వీరి నియామకాలు జరిగాయి.

జిల్లా సమన్వయకర్తలు

సాంఘిక గురుకులాల్లో చాలా వాటికి పూర్తిస్థాయి ప్రిన్సిపాళ్లు లేరు. సుమారు 140 గురుకులాలు ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. సీనియారిటీని పరిగణలోకి తీసుకోకుండా అనుభవం లేని వారిని ఇన్‌చార్జిలుగా నియమించడంతో గురుకులాల నిర్వహణ గాడి తప్పుతోంది. అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లలో చాలా మంది పలుకుబడి, పైరవీలతో వచ్చినవారేననే విమర్శలున్నాయి. దీంతో గురుకులాల్లో పాలన ఇష్టారాజ్యంగా నడుస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జోనల్ అధికారులు, జాయింట్ సెక్రటరీ, డిప్యూటీ సెక్రటరీ స్థాయిల్లో పదవీ విరమణలు, కొందరు వీఆర్ఎస్ తీసుకోవడం వల్ల దాదాపు పది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ లోపాన్ని సరిదిద్దేందుకు ముందుగా జిల్లా సమన్వయకర్తల నియామకాన్ని ప్రభుత్వం చేపట్టింది.

విధులు, బాధ్యతలు

ఈ గురుకుల విద్యా సంస్థల్లో 5 నుంచి ఇంటర్ వరకు జరిగే ప్రవేశాలను ఈ జిల్లా కో-ఆర్డినేటర్లు పర్యవేక్షిస్తారు. పరీక్షల నిర్వహణ, పాఠ్యపుస్తకాల పంపిణీ, ఉత్తమ ఉపాధ్యాయుల గుర్తింపు, విద్యార్థులకు నాణ్యమైన బోధన, ఉపాధ్యాయుల బోధనా తీరు, అవసరాన్ని బట్టి ఆయా పాఠశాలల్లో పార్ట్‌టైమ్ ఉపాధ్యాయుల నియామకం, ఎస్ఏ, ఎఫ్ఏ పరీక్షల తర్వాత విద్యార్థుల ప్రతిభా పాఠవాల విశ్లేషణ తదితర విధులు నిర్వర్తిస్తారు. గురుకుల విద్యా సంస్థల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి పెడతారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన వివిధ పనులు చేపట్టడానికి టెండర్ల ప్రక్రియను వేగవంతం చేస్తారు.

జోనల్, మల్టీ జోనల్ అధికారులు

ఈ గురుకులాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు, జిల్లా సమన్వయకర్తలతో ఎప్పటికప్పుడు చర్చించడం ద్వారా సమస్యల సత్వర పరిష్కారం దిశగా తీసుకునే చర్యల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న ప్రాంతీయ కో-ఆర్డినేటర్ల స్థానంలోనే జోన్లు, మల్టీ జోన్ల వారిగా జోనల్ అధికారులను నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం పది మంది జోనల్ అధికారుల నియామకం జరిగింది. హైదరాబాద్‌లోనిటీజీఎస్‌డబ్ల్యూఆర్ కేంద్ర కార్యాలయంలో ఇన్‌చార్జి అధికారిగా (జోన్-7) కె.నిర్మల, మల్టీజోన్ -1కు కె.అరుణ కుమారి, మల్టీ జోన్ -2కు ఎస్ రజిని, జోన్ -1కు చెంచు గిరిజ, జోన్ -2కు ఎస్ యుగంధర్ లక్ష్మి, జోన్-3కి కె ప్రత్యూశ, జోన్-4కు కె అలివేలు, జోన్-5కు ఎస్ విద్యారాణి, జోన్-6కు వి లక్ష్మాంజలిదేవి, జోన్-7కు కె.విద్యుల్లత నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 268 సంక్షేమ గురుకుల విద్యాలయాలను వీరు పర్యవేక్షిస్తారు.

విధులు, బాధ్యతలు

గురుకుల విద్యా సంస్థల బోధన, బోధనేతర సిబ్బందికి శిక్షణ, వర్క్‌షాపులు, నిర్వహణ, విద్యార్థులకు మెగా ఎంసెట్ వంటి క్యాంపులు, స్టార్ బ్యాచ్ వంటి ఇతర కోచింగ్ శిబిరాలు నిర్వహణ, విద్యా సంస్థల తనఖీ, ప్రశ్నపత్రాల పంపిణీ, విద్యా బోధన, సిలబస్ పూర్తి తదితర అంశాలపై ఎప్పటికప్పుడు ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులతో టెలీ కాన్ఫరెన్స్‌లు, ఇతరత్రా సమావేశాల నిర్వహణ తదితర బాధ్యతలను నిర్వర్తిస్తారు.



విద్య, నిర్వహణ మెరుగుపడుతుంది..
రెసిడెన్షియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అలగోని నరసింహులు గౌడ్

టీజీఎస్‌డబ్ల్యూఆర్ విద్యా సంస్థల్లో విద్యాప్రమాణాలు, పరిపాలన మెరుగుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నందుకు ధన్యవాదాలు. ఇందులో భాగంగా సీనియర్ ప్రిన్సిపాళ్లను జిల్లా కో-ఆర్డినేటర్లు, జోనల్ స్థాయిలో రీజనల్ ఇన్‌చార్జిల స్థానంలోనే జోనల్, మల్టీ జోనల్ అధికారులను నియమించడం పట్ల సంతోషం. వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న 1,650 పదోన్నతులను వెంటనే చేపట్టాలి. దీని వల్ల గిరిజనులు, దళితులు, వెనుకబడిన తరగతుల విద్యార్థులు ఎక్కువగా చదువుకునే గురుకులాలు విద్య, నిర్వహణ మెరుగుపడి మంచి ఫలితాలు వస్తాయి.


సమావేశంలో మాట్లాడుతున్న చక్రపాణి

రోడ్డు భద్రతపై వరంగల్ డిక్లరేషన్

సదస్సులో 5 తీర్మానాలు ఆమోదం

హనుమకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు నిత్య కృత్యంగా మారాయి. ప్రతీరోజు ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదం జరిగి ప్రయాణికులు మృత్యువాతపడుతున్నారు. పలువురు గాయాల పాలవుతున్నారు. ఇటీవలకాలంలో రోడ్డు ప్రమాదాలు మరింతగా పెరిగాయి. హనుమకొండలోని అశోకా హోటల్లో రోడ్డు ప్రమాదాలపై జరిగిన జాతీయ సదస్సులో రోడ్డు ప్రమాదాలకు గల కారణాలు, నివారణకు తీసుకోవలసిన చర్యలపై లోతుగా చర్చించారు. ఈ సదస్సుల్లో మొత్తం 5 తీర్మానాలను ఆమోదించారు. రోడ్డు భద్రతపై వరంగల్ డిక్లరేషన్ పేరుతో బుధవారం ఈ తీర్మానాలను వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి విడుదల చేశారు. జిల్లా ట్రాన్స్‌పోర్టు అథారిటీ, లీగల్ మెట్రాలజీ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్న ఈ సదస్సులో లోతుగా చర్చించి ఈ తీర్మానాలను చేశారు. వీటిని అమలు చేయాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు.

రోడ్డు ప్రమాదాలకు నాలుగు ముఖ్య కారణాలను సదస్సులో గుర్తించారు. లోపభూయిష్టమైన రోడ్లు, లోపాలతో కూడిన వాహనాలు, డ్రైవర్ల నిర్లక్ష్యం, రోడ్ల గజిబిజి, అధ్వాన్న స్థితి వీటిలో ఉన్నాయి. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరగడానికి రోడ్ల డిజైనింగ్‌లో లోపాలు, రోడ్లపై గుంతలు, ఫుట్‌పాత్‌లు లేకపోవడం, డెత్ స్పాట్స్‌ను తొలగించకపోవడం, స్మార్ట్ రోడ్ల పేరిట అధికారులు అవినీతి కారణాలుగా పేర్కొన్నారు. లారీలు, కార్లు, మోటారు సైకిళ్ల తయారీలో లోపాలు, వాహనాలలోని అన్ని రకాల విడిభాగాల తయారీలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నిర్దేశించిన ప్రమాణాలు పాటించకపోవడం, బ్రేక్ టైరాడ్లలో పగుళ్లు, లూజ్ స్టీరింగ్, నాణ్యతగా లేని టైర్లు కూడా రోడ్డు ప్రమాదాలకు హేతువు అవుతున్నాయని తీర్మానంలో పేర్కొన్నారు. స్పీడ్ డ్రైవింగ్, అనుమతి లేని చోట పార్కింగ్, సిగ్నలింగ్ గమనించకపోవడం, డ్రైవర్లకు సరైన నిద్ర లేకపోవడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం తదితర కారణాలు కూడా రోడ్డు ప్రమాదాలకు కారణాలు అవుతున్నాయని విశ్లేంచారు. రోడ్డుపై ఎద్దుల బండ్లు, సైకిళ్లు, ఆటో రిక్షాలు, కుక్కలు, పాదచారులు, స్కూల్ పిల్లల ప్రయాణం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల కూడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తీర్మానించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి 90 శాతం రోడ్డు ప్రమాదాలు రోడ్డు భవనాల శాఖ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యంగా పేర్కొన్నారు. వరంగల్‌లో 10, హనుమకొండలో 14 డెత్ స్పాట్లను గుర్తించినా వాటికి సరిచేయకపోవడం పట్ల సదస్సు విచారం వ్యక్తం చేసింది. వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి 563 నిర్వహణలో ఆ శాఖ అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని నిరసించింది. రోడ్డు భద్రతపై వరంగల్ డిక్లరేషన్ పేరుతో ఆమోదించిన ఈ తీర్మానాలను సంబంధిత శాఖల అధికారులకు అందజేయడం ద్వారా వాటి అమలుకు కృషి చేయాలని సదస్సులో నిర్ణయించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించడానికి విస్తృత స్థాయిలో చైతన్య కార్యాక్రమాలను నిర్వహించాలని కూడా సదస్సు నిర్ణయించింది.

మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు

- పంపిణీకి అధికారుల ఏర్పాట్లు
- మార్చిలో మెప్మా సంఘాల సభ్యులకు..

హనుమకొండ, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి) తెల్ల రేషన్ కార్డు కలిగిన మహిళలందరికీ ఇందిరమ్మ చీరల పంపిణీకి రంగం సిద్ధమైంది. బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి చీరల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. దీంతో గురు వారం నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు చీరల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుంది. వాస్తవానికి మొదట స్వయం సహా యక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు మాత్రమే పంపిణీ చేయాలని ప్రభు త్వం భావించింది. ఆ మేరకు వివరాలను తీసుకొని చీరల స్టాక్‌ను పంపించింది. ఆ మేరకు జిల్లాకు 2.80లక్షల చీరల వచ్చాయి. వీటిని వరంగల్ ఏనుమాముల గోదాములో భద్రపరిచారు. కాగా, బుధవారం చీరల పంపిణీ కార్యక్రమం ప్రారం భం సందర్భంగా కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయ నున్నట్లు ప్రకటించారు. దీంతో ఎస్‌హెచ్‌జీ సభ్యులతో పాటు తెల్లరేషన్ కార్డు కలిగిన 18 ఏళ్ల వయసు దాటిన మహిళలకు కూడా చీరల పంపిణీ జరగను న్నట్లు స్పష్టమైంది. ఈ లెక్కన ప్రస్తుతం జిల్లాకు చేరిన 2.80 లక్షల చీరలతో పాటు మరో 20 నుంచి 30వేల చీరలు అదనంగా కావలసి ఉంది. అయితే ఈ అదనపు చీరలను మెప్మా సభ్యుల కోసం ఇప్పటికే పంపిన లక్షా 71వేల చీరల నుంచి వాడుకోనున్నారు. మెప్మా సభ్యులకు మాత్రం ఇప్పుడు కాకుండా వచ్చే యే డు మార్చి 1న చీరలను పంపిణీ చేయాలని ప్రభుత్వ నిర్ణయించింది. ఈ మేరకు అధికారులకు ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. చీరల పంపిణీ గురువా రం నుంచి పంపిణీ చేయాల్సి ఉన్నది. అది మంత్రులు, ఎమ్మెల్యేల అందుబాటు ను బట్టి ఉంటుంది. సభలను, సమావేశాలను ఏర్పాటుచేసి వారి ద్వారానే చీరలను పంపిణీ చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు డీఆర్‌డీవో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. డిసెంబర్ 9వలోగా చీరల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాల్సి ఉంది.

మార్చిలోపు కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- కోచ్ ఫ్యాక్టరీని సందర్శించిన ఎంపీ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- రైల్వే అధికారులతో ప్రత్యేక సమావేశం

కాజీపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చి లోపు రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తవుతుందని, అందుకు రైల్వే అధికారులు అన్ని చర్యలు చేపడుతున్నారని వరంగల్ ఎంపీ కడియం కావ్య తెలిపారు. కాజీపేట అయోధ్యపురం సమీపంలోని రైల్వే కోచ్‌ఫ్యాక్టరీని బుధవారం వరంగల్ ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు సందర్శించారు. రైల్వే ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మీడియాతో మాట్లాడారు. కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం, పెండింగ్ పనులు, విదేశాల నుంచి తీసుకువచ్చే మిషనరీల గురించి రైల్వే అధికారులతో చర్చించినట్లు చెప్పారు. మార్చిలోపు అన్ని పనులు పూర్తయి ఫ్యాక్టరీ నుంచి వ్యాగన్‌ల ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతుల కుటుంబీకులకు రైల్వేలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. దేశంలో ఇతర రాష్ట్రాల్లో నిర్మించిన కోచ్‌ఫ్యాక్టరీలో స్థానికులకు ప్రత్యేక కోటాలో ఉద్యోగాల భర్తీ ఎలా చేశారో.. అదేవిధంగా అయోధ్యపురం రైతులకు, స్థానికులకు ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు చేస్తున్నామని చెప్పారు. ఔట్ సోర్సింగ్, శాశ్వత ఉద్యోగాల భర్తీ చేసేందుకు కేంద్ర రైల్వే మంత్రిని, ప్రధాని మోదీని కలుస్తామన్నారు.. కాజీపేటకు రైల్వే డివిజన్ హోదా కోసం పార్లమెంట్‌లో లేవనెత్తి డివిజన్ సాధించి తీరుతామన్నారు.


రైల్వే అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

300 ఎకరాల్లో డిపో కోసం స్థల పరిశీలన

దక్షిణ మధ్య రైల్వే జోన్‌పరిధిలో 300 ఎకరాల్లో మెగా మెయింటనెన్స్ డిపో నిర్మాణం చేసేందుకు రైల్వే అధికారులు ప్రణాళికలు చేస్తున్నట్లు ఎంపీ కడియం కావ్య చెప్పారు. ఈ మెగా డిపోలో సరుకు రవాణా చేసే రైళ్లకు పీరియాడికల్, రెగ్యులర్ ఓవరాలింగ్, వ్యాగన్‌ల మరమ్మతుల నిర్వహణ లాంటి ప్రధాన కార్యకలాపాలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం స్టేషన్‌ఘన్‌పూర్ - కాజీపేట రైల్వే స్టేషన్‌ల మధ్య స్థలపరిశీలన చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్ట్‌కు ట్రాక్ కనెక్టివిటీ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాక్ కనెక్టివిటీ ఉన్న ప్రైవేట్ స్థలాలు రేట్లు విపరీతంగా ఉండటంతో స్థల సమస్య ఎదురవుతుందన్నారు. రూ.908 కోట్లతో నిర్మించే ఈ ప్రాజెక్ట్ నిర్మాణంపై త్వరలో ఒక స్పష్టత రానుందని చెప్పారు. అనంతరం కోచ్‌ఫ్యాక్టరీ మొత్తాన్ని ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాగరాజుల, రైల్వే అధికారులు పరిశీలించారు. కడియం కావ్య వెంట రైల్వే సీఎంఈ ఆనంద్, జీజీఎం మురళీకృష్ణ, డీజీఎం శర్మ, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, కాజీపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారం పల్లి శ్రీనివాస్ రెడ్డి, కడిపికొండ గ్రామ శాఖ అధ్యక్షుడు కట్కూరి రమేష్, 45, 46 డివిజన్‌ల అధ్యక్షుడు వస్కుల నాగరాజు, సట్ల సదానందంతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా అయోధ్యపురం రైతులు రైల్వే కోచ్‌ఫ్యాక్టరీలో ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ ఎంపీ కడియం కావ్యకు, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు.

ప్రమాద ఘంటికలు

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- రక్తసిక్తమవుతున్న ప్రధాన రహదారులు
- బాధిత కుటుంబాల్లో తీరని విషాదఛాయలు
- నిబంధనలు పాటించాలంటున్న పోలీసు, ఆర్టీఏ అధికారులు

వరంగల్ క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా కొద్ది రోజులుగా రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. దీంతో వాహనదారులు, రోడ్డుకు ఇరువైపులా నివసించే కుటుంబాలు ఆందోళన చెందుతున్నారు. నిర్లక్ష్య డ్రైవింగ్, అతి వేగంతో ప్రాణాలు కోల్పోవడమే కాకుండా ఇతరుల ప్రాణాలను బలి చేస్తూ ఆయా కుటుంబాల్లో శోకాన్ని మిగిల్చుతున్నారు. కొన్ని సందర్భాల్లో లారీ డ్రైవర్లు నిద్రలేకనో, మద్యం మత్తులోనే రోడ్డు పక్కకే ఉండే ఇళ్లలోకి దూసుకెళుతూ ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం చేస్తున్నారు. అయితే ప్రమాదాలన్నింటికీ రోడ్డు భద్రతా నిబంధనల పాటించకపోవడమే కారణమని పోలీస్‌శాఖతో పాటు రవాణాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.


పర్వతగిరి పీఎస్ పరిధిలోని ఏనుగల్లులో బోల్తా పడిన కారు (ఫైల్)

సెల్‌ఫోన్, మద్యం, నిర్లక్ష్యంతో ప్రమాదాలు

డ్రైవింగ్ సమయంలో వాహనదారులు సెల్‌ఫోన్ మాట్లాడటం, మద్యం సేవించడం, అతి వేగంతోనే ప్రమాదాలకు గురవుతున్నట్లుగా అధికారుల దర్యాప్తులో వెలుగు చూస్తున్నాయి. ట్రాలీ, లారీ డ్రైవర్లతో పాటు ఇతర డ్రైవర్లు జాతీయ రహదారుల పక్కకు ఉన్న వైన్స్ షాపుల్లో మద్యం తాగి గూడ్స్ వాహనాలు నడుపుతుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రసుత్త వాతావరణంలోని మార్పులతో పొగ మంచు పెరిగిన కారణంగా వాహనదారులు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాలు మరింతగా పెరిగే ఆవకాశం ఉంటుందని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు.

మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు
ఉమ్మడి జిల్లా రవాణాశాఖ డీటీసీ జి. సురేశ్‌రెడ్డి



రోడ్డు ప్రమాదాలు అత్యధికంగా మానవ తప్పిదాలతోనే జరుగుతున్నాయి. మద్యం, నిర్లక్ష్యం, అతి వేగం, ఓవర్‌లోడ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ వాహనదారులు ప్రమదాలకు గురవుతున్నారు. రోడ్డు నిబంధనల అమలు బాధ్యతను అధికారులకు వదిలేయకుండా రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలి. నిబంధనల ఉల్లంఘలను నివారించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది నిత్యం రోడ్లపై తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధిస్తాం, అవగాహన కల్పిస్తాం. స్వీయ జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించొచ్చు.

ఇటీవల జరిగిన ప్రమాదాలు

- ఈ నెల 7న పర్వతగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏనుగల్లు వద్ద మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలానికి చెందిన సాహెల్ (23) కారులో ప్రయాణిస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మరణించాడు.
- ఈ నెల 13న ఆత్మకూరు మండలంలోని కొత్తగట్టు సింగారం వద్ద పరకాల నుంచి వరంగల్‌కు కారులో వస్తున్న నలుగురు వ్యక్తులు అతి వేగంగా కారును చెట్టుకు ఢీకొట్టగా వెనుక సీటులో ఉన్న రేగొండ మండల రేపాకు చెందిన పార్థ సంపత్, పరకాల మండల నాగారం గ్రామానికి చెందిన కిషన్‌రావు మరణించగా, ముందు సీటులో కూర్చున్న వెంకటేశ్, మురళికి తీవ్రగాయాలైనాయి.
- మహబూబాద్ జిల్లా శనిగరం శివారులో కుమ్మకుంట్ల తండా వద్ద ప్రభుత్వ ఉపాధ్యాయులతో వెళ్తున్న ఆటోను ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టగా డ్రైవర్ మల్లేశ్, ప్రభుత్వ ఉపాధ్యాయులు చెన్నబోయిన శోభ, బానోత్ కళావతి, మద్దెల సింధూజ, వెల్పుగొండ శైలజా, నారపాక స్వరూప తీవ్రంగా గాయపడటంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.
- ఈనెల 14న దేవరుప్పల మండలంలోని రంబోజీగూడెంకు చెందిన నక్కిరెడ్డి పూజ (13) 8వ తరగతి చదువుతున్న బాలిక సైకిల్‌పై పాఠశాలకు వెళ్తుండగా ట్రాక్టర్ డ్రైవర్ గుర్రం కుమార్ అతివేగంతో ఢీకొట్టిన ఘటనలో బాలిక మరణించింది.
- ఈ నెల 14న దుగ్గొండి మండలంలోని గిర్నిబావి ప్రధాన దారిపై లారీ ఢీకొని గీసుగొండ మండలం ఆనంతారం గ్రామానికి చెందిన హనుమాయమ్మ అక్కడికి అక్కడే మరణించింది. జనగామ జిల్లాలోని రఘునాథపల్లి మండలంలోని గోవర్ధనగిరి దర్గా వద్ద ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనగా వెనుకాల కూర్చున్న వర్ధన్నపేట పరిధిలోని నల్లబెల్లికి చెందిన రాపాక వినోద్ (29) మృతి చెందగా ముందున్న వ్యక్తి గాయపడ్డాడు.

నేటితో కార్తీక మాసం ముగింపు

- రేపటి నుంచి మార్గశిర మాసం
- విశేష పండుగలు, ప్రత్యేక పూజలు

వరంగల్ కల్చరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నెల రోజుల పాటు పూజలు, అభిషేకాలు, అర్చనలు, వ్రతాలు, వన భోజనాలు, దీపోత్సవాలతో కొనసాగిన కార్తీక మాసం గురువారంతో ముగియనుంది. గురువారం అమావాస్య సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు కొనసాగుతాయి. ఆధ్యాత్మిక మాసంగా అమావాస్య రోజు గౌరీ నక్తం నిర్వహిస్తారు. పండుగ, పర్వదినాలతో కొనసాగిన కార్తీక మాసంలో కేదారేశ్వర వ్రతాలు, కార్తీక పౌర్ణమి, తులసీ ధాత్రినారాయణ కల్యాణం, ఏకాదశి పర్వదినం నిర్వహించుకున్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని దేవాలయాల్లో ప్రతీ రోజు సాయంత్రం కార్తీక దీపోత్సవాలను నిర్వహించాలని ఆదేశించినప్పటికీ చాలావరకు ఆలయాల్లో నిర్వహించలేదు. కేవలం భద్రకాళి దేవాలయంలో మాత్రమే కార్తీక దీపోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

- దేవతల మాసంగా..

కార్తీక మాసం ముగిసిన అనంతరం శుక్రవారం నుంచి మార్గశిర మాసం ప్రారంభమవుతుంది. ఈ మాసాన్ని దేవతల మాసంగా పిలుస్తారు. ఈ మాసంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి, గీతాజయంతి, మోక్షద ఏకాదశి, దత్తజయంతి, కాలభైరవ అష్టమి, మాస శివరాత్రి వేడుకలు జరుగుతాయి. ఈ మాసంలో నదీ స్నానాలను ఆచరిస్తారు.

వనదేవతలకు ముందస్తు మొక్కులు

10 వేలకు పైగా తరలివచ్చిన భక్తులు

తాడ్వాయి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మకు ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తుల బుధవారం అధికంగా తరలివచ్చారు. వనదేవతల సంప్రదాయాల్లో భాగంగా ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. అలాగే కల్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించి దేవతల గద్దెలకు చేరుకున్నారు. ఎత్తుబంగారం (బెల్లం), కొబ్బరి కాయలు, చీరెసారె, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 10వేల మందికి పైగా భక్తులు తరలి వచ్చినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.


వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో పని చేయాలి : కలెక్టర్

మహబూబాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లా లక్ష్యాలను సాధించాలని, రుణాల పంపిణీలో పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లాస్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు.జిల్లా లక్ష్యాలు సాధించిన ప్రగతి, రానున్న సీజన్‌లో రైతాంగానికి అం దించాల్సిన పంట రుణాలు తదితర అంశాలపై బ్యాంకుల వారీగా సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు క్రాప్‌లోన్లు 43.91 శాతం, వ్యవసాయ టర్మ్‌లోన్లు 57.96 శాతం, స్వయం సహాయక సంఘాల రుణాలు 47.99 శాతం, సీఎం స్వనిధి 99.53 శాతం పూర్తి చేశారని తెలిపారు. పూర్తిస్థాయిలో పంట రుణ పంపిణీ లక్ష్యాన్ని అధిగమించాలని చెప్పారు. లక్ష్యానికి అనుగుణంగా కొన్ని బ్యాంకులు రుణాలు అందిస్తుండగా, మరికొన్ని బ్యాంకులు వెనుకంజలో ఉండి పోతున్నాయని చెప్పారు. వందశాతం లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలకు పూర్తిస్థాయిలో లింకేజీ రుణాలు పంపిణీ చేయాలని, సబ్సిడీ రుణాల పంపిణీలో జాప్యం చేయవద్దన్నారు. కూరగాయల పంటలకు చెందిన రుణాలను త్వరగా రైతులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్, ఆర్బీఐ ఎల్‌డీవో డి.బారువ, లీడ్ బ్యాంకు మేనేజర్ యాదగిరి, జిల్లా అధికారులు మధుసూదనరాజు, విజయ నిర్మల, డాక్టర్ కిరణ్‌కుమార్, మరియన్న, విజయ, దేశీరాం, శ్రీమన్నారాయణరెడ్డి, బ్యాంకు అధికారులు చైతన్య, రవి కమాలకర్, బి. కృష్ణ మోహన్, షరీఫ్, వేణు పాల్గొన్నారు.



బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి


డోర్నకల్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు


తొర్రూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు


మానుకోటలో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నేతలు

- నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని, దివంగత ఇందిరాగాంధీ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. మానుకోట పట్టణంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో ఆమె విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మహబూబాబాద్ పట్టణంలోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చి భారతదేశ అభ్యున్నతికి పాటు పడ్డారని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఖలీల్‌పాష, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, నీరుటి లక్ష్మీనారాయణ, ఎమ్డీ. హరుణ్, గుగులోతు వెంకట్, నీరుటి సురేష్‌నాయుడు, బోడ రవినాయక్, పోతురాజు రాజు, చలమల నారాయణ, బొల్లు రాజు, నిమ్మల శ్రీను, హరిసింగ్, దండెబోయిన బుజ్జివెంకన్న, నాళ్ల లక్ష్మీనర్సింహారావు, ఆకుల శ్రీను, శంతన్ రామారాజు, బోనగిరి గిరిధర్‌గుప్తా, తాళ్లపల్లి జగన్, సిరిపురం వీరన్న, శంకర్, వీరభద్రం, విజయలక్ష్మి, భూక్య లక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

మరిపెడ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక విశ్రాంతి భవనంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కాంగ్రెస్ నేతలుయుగేందర్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి, అంబరీష, తాజోద్దీన్,రాంలాల్, అశోక్, గుండగాని వేణు, వెంకన్న, సురేష్, రవికాంత్ పాల్గొన్నారు.

● దంతాలపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్‌తో పాటు మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీవో విజయ, ఎంపీవో పాషా తదితరులు పాల్గొన్నారు.

● తొర్రూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెదగాని సోమయ్య, సోమ రాజశేఖర్, కుమార్, బాప్‌రెడ్డి, అచ్చిరెడ్డి, గజానంద్ పాల్గొనారు.

● బయ్యారంలో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధుకర్‌రెడ్డి, ముసలయ్య, రవినాయక్, వీరారెడ్డి వెంకటపతి, నాగేశ్వర్‌రావు, లక్ష్మి, రమేష్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కురవిలో ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కురవి టౌన్ ప్రెసిడెంట్ ఎస్.రాజేందర్‌కుమార్ పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో చాగంటి సందీప్, దడిగెల శరత్, కోర్ని సురేష్, చిన్నం గణేష్, బుక్క నాగరాజు, బూరుగుల కృష్ణ, గడీల వినోద్, సంగెం నాగరాజు పాల్గొన్నారు.

● డోర్నకల్‌లో ఇందిరానగర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాల నివాళ్లర్పించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుమీర్‌చంద్‌జైన్, నాయకులు మాద శ్రీనివాస్, వాంకుడోతు వీరన్న, కేశబోయిన కోటిలింగం, అంగోతు వెంకన్న, బత్తుల శ్రీనివాస్, రెడ్డబోయిన శంకర్, శీలం శ్రీనివాస్, తెల్లావుల హరికృష్ణ, సాదనాల వెంకటేశ్వర్లు, మల్లం అనిల్, వీరభద్రం, దాసరి నాని, సుశీల్‌కుమార్‌జైన్, ఎర్ర శ్రీను పాల్గొన్నారు.

● కొత్తగూడలో ఇందిరాగాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు వజ్జ సారయ్య, మొగిలి, జనార్దన్‌రెడ్డి, రూప్‌సింగ్, లావణ్య, వెంకన్నలు పూలమాల వేసి నివాళ్లర్పించారు.

ఎన్‌కౌంటర్ ముమ్మాటికి బూటకమే

- సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్

మహబూబాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మారెడుమిల్లి ఎన్‌కౌంటర్ అది ముమ్మాటికి బూటకపు ఎన్‌కౌంటరేనని, దానిపై తక్షణమే న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదివాసీ ఆరాధ్యుడు హిడ్మాతో పాటు మరికొంత మందిని చిత్రహింసలు పెట్టి క్రూరంగా చంపివేసి ఎన్‌కౌంటర్ అని కట్టుకథ అల్లారని చెప్పారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా సామ్రాజ్యవాదుల మెప్పు కోసం వచ్చే మార్చినాటికి మావోయిస్టులను అంతమెందిస్తామని ప్రకటనలు చేస్తున్నారని పేర్కొన్నారు. సమాజంలో అసమానతలు, అవినీతి, అణిచివేత, దోపిడీ, నిరుద్యోగ సమస్యలకు వ్యతిరేకంగా హిడ్మా పోరాటాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేశారని చెప్పారు. అందుకే హిడ్మా మెజార్టీ ప్రజలకు ఆరాధ్యుడయ్యారని తెలిపారు. దండకారణ్యంలో అటవీసంపదను బహుళజాతి సంస్థలకు కట్టబెట్టేందుకు పాలకులు కుట్రలు చేస్తున్నారని తెలిపారు. పోలీసులు పట్టుకున్న మావోయిస్టులను తక్షణమే కోర్టులో హాజరుపర్చాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మారెడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు జడ్జీచే న్యాయ విచారణ జరిపించాలని, దండకారణ్యంలో కేంద్ర పారామిలిటరీ బలగాలను వెనక్కి రప్పించాలని విజ్ఞప్తి చేశారు.

వృద్ధుల జీవన విధానాన్ని మెరుగుపరిచే దిశగా చర్యలు

- అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో



మాట్లాడుతున్న లెనిన్‌వత్సల్ టొప్పో

మహబూబాబాద్ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వృద్ధుల జీవన విధానాన్ని మెరుగుపరిచే దిశగా మరిన్ని సంక్షేమ చర్యలు తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రప్రభుత్వం, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆదేశాలతో మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోవృద్ధుల కోసం ప్రతిష్టమైన సంక్షేమ చట్టం ఉందని, తల్లిదండ్రులను సరిగా చూసుకోని వారిపై చట్టప్రకారం తగు చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. వృద్ధుల సంక్షేమం, ఆరోగ్యం, ప్రభుత్వ పథకాల అమలు, వారి సమస్యలు, ఆవశ్యకతపై విస్తృతంగా చర్చించారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి సబిత, తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రుద్రారపు ముత్తయ్య, ఉల్లి విశ్వనాథచారి పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య


నవీన్(ఫైల్)

బయ్యారం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడగా, బుధవారం కేసు నమోదుచేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. సింగారం గ్రామానికి చెందిన బాదావత్ సీతారామ్-శాంతి దంపతుల పెద్ద కుమారుడు నవీన్ (27) కొంత కాలంగా అనారోగ్యంతోబాధపడుతున్నాడు. కుటుంబసభ్యులు ఆయనకు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినప్పటికి ఫలితం లేకపోయింది. మనస్థాపం చెందిన నవీన్ జీవితంపై విరక్తి చెంది గ్రామ శివారులోని ఓ చేనులో పురుగులమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారకస్థితిలో పడివున్న ఆయనను గమనించిన కుటుంబసభ్యులు, స్థానికులు చికిత్స నిమిత్తం తొలుత జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న నవీన్ ఆరోగ్య పరిస్థితి మరింత విషమించడంతో బుధవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తమ్ముడు కల్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

శివలింగానికి అన్నాభిషేకం

బయ్యారం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాస పర్వదిన ముగింపును పురస్కరించుకొని బుధవారం బయ్యారం శివాలయంలో శివలింగానికి అన్నాభిషేకం నిర్వహించారు. అంతకు ముందు అర్చకుడు ఉదయ్‌కుమార్ శివలింగానికి అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నాభిషేకం అలంకరణలో శివలింగం భక్తులకు దర్శనమివ్వగా, తహసీల్దార్ నాగరాజుతో పాటు పలువురు శివున్ని దర్శించుకున్నారు. అన్నదాన దాతలు తిరుమల సంజీవ్‌రెడ్డి, మధుసుధన్‌రెడ్డి దంపతులతో పాటు నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

మత్స్యకార్మిక దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

డోర్నకల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో 21న ప్రపంచ మత్స్యకార్మిక దినోత్సవం నిర్వహించనున్నట్లు ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యాయులు మారబోయిన రాంభద్రం తెలిపారు. ఈ సందర్భంగా ప్రపంచ మత్స్యకార్మిక దినోత్సవ పోస్టర్లను గాంధీసెంటర్‌లో బుధవారం ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు నీలం కృష్ణ, ఉపాధ్యక్షుడు రెడ్డబోయిన శంకర్, డోర్నకల్ పట్టణాధ్యక్షుడు మామిడి రాంమ్మూర్తి, ఉపాధ్యక్షుడు మారబోయిన శ్రీనాథ్, నాయకులు కన్నయ్య, మామిడి నాగరాజు, పెండ్యాల వీరన్న, పగడాల వినయ్, తోట ప్రసాద్, వెంకన్న, సొడం మహేష్, బి.సత్యనారాయణ, రెడ్డబోయిన మహేష్, మంద వీరన్న, నాగన్న పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పట్టణంలోని హౌసింగ్ బోర్డుకాలనీ వాసులు కార్తీక వనభోజనాలకు వెళ్లారు. కార్తీక మాసం చివరి రోజు బుధవారం కురవి మండలం గుండ్రాతి మడుగు సమీపంలోని మామిడి తోటలో సంప్రదాయ బద్ధంగా ఉసిరి చెట్లకింద వనభోజనాలు చేశారు. ప్రతీ ఏటా కార్తీక మాసంలో ఉసిరి చెట్టుకింద వనభోజనాలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఏ ఏడాది కూడా ఉసిరి చెట్ల వద్ద హౌసింగ్‌బోర్డు కాలనీ వాసులు కుటుంబ సమేతంగా పూజలు చేసి, వనభోజనాలు చేశారు.

'ప్లాస్టిక్‌ను విక్రయిస్తే కఠిన చర్యలు'


షాపు యాజమానికి జరిమానా రశీదును అందిస్తున్న అధికారులు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మానవుల అనారోగ్యానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మునిసిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ కరుణాకర్ హెచ్చరించారు. మహబూబాబాద్ పట్టణంలోని పాతబజారులో మునిసిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్ ఆదేశాలతో వివిధ దుకాణాల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. వివిధ షాపుల్లో విక్రయిస్తున్న 8 కేజీల ప్లాస్టిక్ కవర్లు సీజ్‌చేసి ఆయా షాపుల యాజమానులకు రూ.6500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్స్‌పెక్టర్ కరుణాకర్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను విక్రయిస్తే జరిమానాలు విధించడమే కాదని ఏకంగా షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ క్రాంతి పాల్గొన్నారు.

'హత్య చేసిన వారిని శిక్షించాలి'


అంబేద్కర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

కేసముద్రం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ప్రేమవివాహం చేసుకున్న దళిత యువకుని సోదరుడైన రాజశేఖర్‌ను పెట్రోల్ పోసి కుల దురహంకార హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కులవివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) మండల కార్యదర్శి సోమారపు ఎల్లయ్య డిమాండ్ చేశారు. కేసముద్రం అంబేద్కర్ సెంటర్‌లో బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 142 కుల దురహంకార హత్యలు చోటు చేసుకున్నాయని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.50లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గొడిశాల వెంకన్న, జల్లె జయరాజు, పొలెపాక శంకర్, వల్లందాసు నాగరాజు, వల్లందాసు సతీష్, పానుగంటి సందీప్, ముద్రకోల సారయ్య పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీలకు కల్వల విద్యార్థులు

కేసముద్రం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నల్గొండలో ఈనెల 21 నుంచి 23 వరకు నిర్వహించే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు కల్వల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం బందారు నరేందర్, పీడీ కొప్పుల శంకర్ బుధవారం తెలిపారు. ఇటీవలె నెల్లికుదురు జడ్పీహైస్కూల్లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టుకు అండర్ 17 విభాగం బాల, బాలికల గుగులోత్ నితీష్ బానోత్ అనిత ఎంపికైనట్లు వారు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయుల అభినందించారు.

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై



షీటీం ఎస్సై సునందను సన్మానిస్తున్న హెచ్‌ఎం గిరిజ, ఉపాధ్యాయులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అపరిచితుల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని షీ టీం ఎస్సై సునంద అన్నారు. కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్ నాథ్‌కేకన్ ఆదేశాల మేరకు భరోసా ఆధ్వర్యంలో బుధవారం మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థినులకు ఎలాంటి వేధింపులు, మెసేజ్‌లు వచ్చినా వెంటనే డయల్ 100, షీటీం హెల్ప్‌లైన్, వాట్సాప్ నెంబర్ : 8712656935ను సంప్రదించాలన్నారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా విద్యార్థులు క్రమ శిక్షణ, పట్టుదలతో చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. యువత మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు లోను కాకుండా బంగారుభవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. విద్యార్థినులకు గుడ్‌టచ్.. బ్యాడ్‌టచ్, పోక్సో చట్టం, మహిళలు, బాలల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు పెట్టవద్దని, అనుమానాస్పద లింకులను క్లిక్‌చేసి సైబర్ నేరాల బారిన పడవద్దని సూచించారు. సైబర్ నేరాల బారిన పడినట్లు అయితే హెల్ప్‌లైన్ నెంబర్ 1950కు ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం ఎస్సై సునందను హెచ్‌ఎం గిరిజ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు ఉప్పలయ్య, సోహన్‌బీ, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసరావు, తిరుపతి, శిబారాణి, సతీష్‌రెడ్డి, సోమేశ్వర్, ఝాన్సీ మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, వీరభద్రం, యుగందర్, అరుణ, రమేష్, పార్వతి, భరోసా సిబ్బంది జ్యోత్స్న, రేణుక పాల్గొన్నారు.

వనభోజనాలకు వసతిగృహ విద్యార్థులు

ఇనుగుర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహానికి చెందిన 30 మంది విద్యార్థులను కొత్తగా వనభోజనాలకు తీసుకువెళ్లారు. ఆ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు విద్యార్థుల మానసికోల్లాసం కోసం అయ్యగారిపల్లి మామిడితోటలో వనభోజనాలు చేయించినట్లు వార్డెన్ రాంబాబు తెలిపారు. ఎప్పుడూ లేని విధంగా వనభోజనాలకు తీసుకువెళ్లడంతో విద్యార్థులు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో వార్డెన్‌తో పాటు జడ్పీహైస్కూల్ ఉపాధ్యాయులు యాకయ్య, పీడీ ప్రణయ్, నారాయణ, పప్పుల సువర్ణ పాల్గొన్నారు.


వనభోజనాల్లో వసతి గృహ విద్యార్థులు

'గీత కార్మికులు తరలిరావాలి'



గీతన్నల రణభేరి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కేజీకేఎస్ నేతలు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేటలో జరుపతలపెట్టిన గీతన్నల రణభేరికి కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి యమగాని వెంకన్న పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవనంలో బుధవారం గీతన్నల రణభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేటలో కేజీకేఎస్ రాష్ట్ర 4వ మహాసభలను పురస్కరించుకుని ఈనెల 28న గీతన్నల రణభేరి పేరిట భారీ బహిరంగసభను నిర్వహిస్తున్నామన్నారు. దీనికి గీత వృత్తిదారులంతా హాజరై తమ సత్తాచాటాలని విజ్ఞప్తి చేశారు. 29, 30న సంఘం ప్రతినిధుల సభ ఉంటుందని, అందులో గీత కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గౌని వెంకన్న, వెంకటేశ్వర్లు, వీరస్వామి, ఉప్పలయ్య, సత్యనారాయణ, యాకన్న, నాగేశ్వరరావు, వెంకన్న, శ్రీనివాస్, మధు పాల్గొన్నారు.

'ఉత్సవ' కమిటీలు

(5వ పేజీ తరువాయి)

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ పరిస్థితి ఇలాగే ఉంది. కలెక్టర్ అధ్యక్షతన ఉండే ఈ కమిటీ మూణ్నెళ్లకోసారి సమావేశం కావాలి. ఆరు నెలలవుతున్నా ఇప్పటి వరకు ఒక్క సారి కూడా కాలేదు.

పాఠశాల పర్యవేక్షణ కమిటీలు

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, వాటి పనితీరులో యాజమాన్య కమిటీలది కీలక భూమిక. పాఠశాలల బలోపేతానికి, సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయుల ఇష్టారాజ్యాన్ని అడ్డుకోవడానికి ఈ కమిటీలు ఎంతో దోహదపడతాయి. ప్రజల భాగస్వామ్యంతో ఇవి పని చేయాల్సి ఉంటుంది. కానీ పేరుకే పరిమితమయ్యాయి. సమావేశాల నిర్వహణను గాలికి వదిలేశాయనే ఆరోపణలున్నాయి. నిధులలొచ్చినప్పుడు సంతకాల కోసం పాఠశాల యాజమాన్య కమిటీలు సభ్యులకు సమాచారం ఇస్తున్నాయి. పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల యాజమాన్య కమిటీలు, మధ్యాహ్న భోజన కమిటీలు కూడా ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు ప్రతీ మూడో శనివారం సమావేశం కావల్సి ఉంది. ఈ కమిటీలు ఉమ్మడి జిల్లాలో మొదట్లో చురుగ్గా పని చేసిన ఆ తర్వాత అటకెక్కాయి. ప్రస్తుతం 90 శాతం పాఠశాలల్లో నామామాత్రంగా కమిటీలుపని చేస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి.

అంగన్వాడీ కమిటీలు

అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పోషకాహారం అర్హులకు అందేలా చూడటటం, లోపాలను గుర్తించి అవగాహన కల్పించేందుకు ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ చైర్మన్‌గా కమిటీలను ఏర్పాటు చేశారు. ఇందులో వార్డు సభ్యులతో పాటు మహిళలు, యువత, కిశోర బాలికలు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీలు అలంకార ప్రాయంగా మారాయనే విమర్శలున్నాయి. ఎక్కడా ప్రత్యేకంగా సమావేశాలు జరగడం లేదు. అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే సరుకులు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో గుడ్డు సైజు చిన్నగా ఉండడం, బాలామృతం సరిగా పంపిణీ చేయకపోవడం, ఇష్టానుసారంగా కేంద్రాలను మూసివేయడం వంటి ఉదంతాలు ఉమ్మడి జిల్లాలో జరిగాయి. కమిటీలో సభ్యులుగా ఉన్నామనే విషయం కొందరికి తెలియదంటే అతిశయోక్తి కాదు.

ఆహార సలహా సంఘాలు

ప్రజాపంపిణీ వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా పేదలకు నిత్యావసర సరుకులు అందేలా చూసేందుకు ఆహార సలహా సంఘాలను ఏర్పాటును అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటి వరకు ఈ కమిటీల ఏర్పాటే జరగలేదు. ఈ విషయమై వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పదే పదే ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. జిల్లా స్థాయిలో జిల్లా పౌరసరఫరాల అధికారులు, మండల స్థాయిలో తహసీల్దార్ చైర్మన్‌గా, అఖిల పక్ష పార్టీల నాయకులు, వినియోగదారుల మండలి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఏర్పాటయ్యే ఈ కమిటీలు అక్రమాలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలి. ఈ సంఘం మూణ్నెళ్లకోసారి సమావేశమై ప్రజాపంపిణీ వ్యవస్థ తీరు తెన్నులపై చర్చించాలి. ప్రస్తుతం ఈ సంఘాలు ఎక్కడ సమావేశం కావడం లేదు. దీంతో పూర్తి స్థాయిలో సరుకుల పంపిణీ జరగడం లేదు. రేషన్ బియ్యం అక్రమ దందా జోరుగా సాగుతోంది.